లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

- సీఐ నాగరాజుగౌడ్

హయత్‌నగర్, డిసెంబర్ 13 : కక్షిదారులు కేసును రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడం రాజమార్గమని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ అన్నారు. శనివారం హయత్‌నగర్ కోర్టులో జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాల కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. నేషనల్ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం వల్ల ఎటువంటి ఖర్చు ఉండదని తెలిపారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమాజానికి అవసరమయ్యే పరిశోధనల అవసరం ప్రస్తుత కాలంలో ఎంతగానో ఉందని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ జియోఫిజిక్స్ విభాగంలో 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. జియోఫిజిక్స్ విభాగం, సెంటర్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్, ఏఈజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుండ ప్రభాకర్, షిజయ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కృష్ణ కుమార్ గుప్త, ఏఈజీ సెక్రెటరీ డాక్టర్ బి. నరసింహారావు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి బాబు, కోశాధికారి జవహర్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

హయత్‌నగర్, డిసెంబర్ 13: హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్, తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్(టీఎస్‌కేసీ) కేరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐఏసీ ఇంటర్నేషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ వారు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, ఉన్నత విద్య గైడెన్స్ కోసం అవగాహన సదస్సు నిర్వహించి పుస్తకాలు పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్‌లో ఉద్యోగ సమాచారం కోసం, కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్‌కు ఏవిధంగా ప్రిపేర్ కావాలనే అంశాలపై అవగాహన కల్పించారని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను ఏవిధంగా సాధించుకోవాలి., ఇంటర్వ్యూ, వివిధ రకాల నైపుణ్యాలను ఇంప్రూవ్ చేసుకునే విధానంపై వివరించారని తెలిపారు. అనంతరం తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ మక్ల మాట్లాడుతూ.. విద్యార్థులు అకాడమిక్స్ పర్ఫామెన్స్‌తోపాటు కాంక్రీట్ ఎగ్జామినేషన్ లో కూడా రాణించి భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు పొందడానికి మంచి నైపుణ్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తదనంతరం అకాడమిక్ కోఆర్డినేటర్ నరసింహా మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను చక్కగా ఉపయోగించుకుని తమ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీషు విద్యాసాగర్, కేరీర్ గైడెన్స్ ఇన్‌చార్జి డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్, కృష్ణమోహన్, నక్క నరసింహా, యాదగిరిరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి ..

ఆయుర్వేద వైద్య నిపుణులతో మాట్లాడుతున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, డిసెంబర్ 13 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని వైద్యులు పనిచేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శుక్రవారం పాతబస్తీ వాసుల కోసం జీవశ్రీ ఆయుర్వేదిక్ సంస్థ అక్బర్‌బాగ్ డివిజన్‌లో వైద్య సేవలు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంత మహిళల కోసం ప్రత్యేక వైద్య సేవలను అందించడానికి నిపుణులైన మహిళా వైద్యులను ఏర్పాటు చేయటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జీవశ్రీ ఆయుర్వేదిక్ మేనేజింగ్ డైరెక్టర్ కొంటె ఫణిశ్రీ మాట్లాడుతూ.. మహిళలకు ప్రత్యేక వైద్య సేవలను అందిస్తున్నామని, డాక్టర్ సునీత గ్రేస్ ఆధ్వర్యంలో ఫైల్స్ పిస్టుల తదితరవి బయటకు చెప్పుకోలేని గుప్త రోగాలకు ప్రత్యేకంగా మెరుగైన చికిత్స అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాతమలక్‌పేట ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీ, ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ దత్త కుమార్, డాక్టర్ కల్పన, డాక్టర్ సత్యదీప, డాక్టర్ సుస్మిత, మల్లికార్జున్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కల్లు గీత సంఘం నాయకుడు బొంగు వెంకటేశ్‌గౌడ్

మన్సూరాబాద్, డిసెంబర్ 13: కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కల్లు గీత సంఘం నాయకుడు బొంగు వెంకటేశ్‌గౌడ్ కోరారు. ఎల్బీనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కల్లు గీత వృత్తిపై ఆధారపడిన వారి కోసం ఇచ్చిన సేఫ్టీ కిట్లను ఇప్పటి వరకు 10 వేలు మాత్రమే పంపిణీ చేశారన్నారు. గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ. 7 కోట్ల 90 లక్షల నిధులను వెంటనే మంజూరు చేయాలన్నారు. వృత్తిలో ప్రమాద బారినపడినవారికి టాడి టాపర్ ద్వార ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో సొసైటీలను పునరుద్ధరించి టాడి టాపర్లకు ద్విచక్ర వాహనాలను అందించాలని కోరారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గీత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రమాదపు అంచుల్లో ఉన్న వృత్తి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బత్తుల అంజయ్య, మల్లెబోయిన రమేశ్‌గౌడ్, శోభన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్

బడంగ్‌పేట, డిసెంబర్ 13: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ అధ్యక్షతన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఆమె సూచించారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా నిజమైన పేద ప్రజలను గుర్తించి వారికే ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డీఈఈ వెంకన్న, మేనేజర్ చంద్ర ప్రకాశ్‌రెడ్డి, ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే బలాలకు వినతి పత్రాన్ని అందజేస్తున్న తెలంగాణ దళిత గిరిజన సేవా సంఘం నాయకులు

మలక్‌పేట, డిసెంబర్ 13 : తీగలగూడ శ్రీ బంజారా బస్తీ వాసులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇప్పించాలని కోరుతూ మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిసి వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలంగాణ దళిత గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్టు దాసురావు తెలిపారు. శ్రీ బంజారా బస్తీలో సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు సోషల్ ఎకానమీ సర్వే (ఎస్‌ఈఎస్) నిర్వహించి 131 మందిని అర్హులుగా గుర్తించారని, నాలుగు ఏండ్లు పూర్తి అవుతున్నా అర్హులైన పేద ప్రజల సొంతంటి కల నెరవేర లేదన్నారు. స్థానికులకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామని, అందుకు జిల్లా కలెక్టర్‌కు లెటర్ రాస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చందులాల్‌నాయక్, సత్తారపు గోపాల్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని భాషలు నేర్చినా మాతృ భాషను మరువద్దు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 13 : ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువద్దని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షల పురస్కారాల ప్రధానోత్సవంలో అశోక్ తేజ ప్రసంగిస్తూ తెలుగు భాష అజంత భాష అని అన్నారు. తమిళులకు తమిళ భాషపై ఉన్న ప్రేమ తెలుగు వాళ్లకు తెలుగుపై లేకపోవడం బాధాకరమన్నారు. తెలుగు భాష చిరంజీవిగా ఉండిపోవాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు దైవజ్ఞశర్మ, ప్రొఫెసర్ పీవీఎల్ మాధవరావు, బి. రూప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ షేక్‌మస్తాన్, సీనియర్ జర్నలిస్టు మైనంపాటి అన్నమాచారి, వే ఫౌండేషన్ అధినేత డాక్టర్ పైడి అంకయ్య, వాఖ్యాత మోహన్‌కుమార్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ భాషలలో నిర్వహించిన పోటీలలో విజేతలైన ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

నేడు తూంకుంటలో రైడ్ సేఫ్టీ వర్క్‌షాప్

శామీర్‌పేట, డిసెంబర్ 13: రైడ్ టూ సేఫ్టీ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని శ్రీ విజ్ఞాన భారతి హై స్కూల్ కరస్పాండెంట్ గోనె హనుమంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు తూంకుంట శ్రీ విజ్ఞాన భారతి హై స్కూల్ క్యాంపస్‌లో రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులకు అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, శామీర్‌పేట సీఐ శ్రీనాథ్, ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్‌లు విచ్చేస్తున్నట్లు తెలిపారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు

మేడ్చల్, డిసెంబరు 13: మేడ్చల్ నుంచి శబరిమలకు అద్దె ప్రాతిపదికన బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ మేడ్చల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావు తెలిపారు. అద్దె ప్రాతిదికన కేటాయించే బస్సులను శుక్రవారం పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప భక్తులు శబరిమలకు వెళ్లేందుకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ ఇంజినీరు స్నేహలత, ఏఎంఎఫ్ లక్ష్మణ్, సెక్యూరిటీఇన్‌చార్జి నరేందర్, డిపోఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎల్‌సీహెచ్ మినీ డీ-కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి , తదితరులు

సైదాబాద్, డిసెంబర్ 13 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించే విధంగా పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎల్‌సీహెచ్ మినీ డీ-కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను, తిరుమల హిల్స్‌లో నూతనంగా వేసిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె శుక్రవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అనేక కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, వాటి పురోగతి, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తాను స్వయంగా పరిశీలిస్తున్నానని తెలిపారు. పనుల్లో జాప్యంలేకుండా జీహెచ్ఎంసీ తగు చర్యలు తీసుకోవాలని, కొత్త పనులకు సంబంధించిన ప్రతిపాదనలు చేయాలన్నారు. అభివృద్ధి పథంలో డివిజన్‌ను నడిపించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని, ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామని ఆమె తెలిపారు. అదే విధంగా డివిజన్ పరిధిలో మురుగు సమస్య పరిష్కారానికై సైదాబాద్ డివిజన్‌కు మినీ ఎయిర్‌టెక్ కేటాయించాలని కోరుతూ జలమండలి జీఎం శ్యాం సుందర్ నాయక్‌కు వినతి ప్రతాన్ని సైదాబాద్ జలమండలి మేనేజర్ శ్రవణ్‌కుమార్‌తో కలిసి అందజేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, రోషన్ సాగర్, శశంక్ యాదవ్, శ్రీనాథ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

భూలక్ష్మి ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ జంగం శ్వేత, తదితరులు

సైదాబాద్, డిసెంబర్ 13 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. శుక్రవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మి ఆలయం, గోశాల ఫుట్‌పాత్‌పై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో, గోశాల ఆవరణలో మొక్కలను నాటి వాటిని పెంచడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ హార్టికల్చర్ మేనేజర్ యమున, హెచ్ఏ సుష్మా, భూలక్ష్మి ఆలయం, గోశాల కమిటీ ప్రతినిధులు గుర్రం మోహన్‌రెడ్డి, అరవింద్, జగన్, రేఖ, లక్ష్మి, రఘు కార్తీక్, సందీప్‌సాగర్, రాజు, డి. మధు, రవి, మధు,తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు ..

ఎల్బీనగర్, డిసెంబర్ 13 : దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో ఈనెల 14 నుంచి 18వరకు దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. జయంతి కార్యక్రమంతో పాటుగా సాయిబాబా 72 గంటల సమాధిఘట్టం (సాయినాథోత్సవం) కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ శ్యాంకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

లాడ్జీల్లో బస.. రైళ్లలో చోరీలు

- ఇద్దరు నిందితుల అరెస్ట్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 13: లాడ్జీల్లో మకాం వేస్తూ రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర నిందితులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 4.3 తులాల బంగారు నగలు, రూ 19 వేల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీలు సాయిఈశ్వర్ గౌడ్, సరస్వత్‌లతో కలిసి సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్ఎన్. జావేద్ వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రం, ముంగేర్ జిల్లాకు చెందిన అన్నురాజ్ (31) టీ వ్యాపారం చేస్తున్నాడు. నిరజ్‌కుమార్ (18) కురగాయాల వ్యాపారం చేసుకుంటాడు. అదే గ్రామ వాసి అమర్జిత్‌కుమార్ వివిధ పనులకు వెళ్తుంటారు. అయితే వీరు మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారు. దీంతో వీరికి వచ్చిన అదాయం సరిపోకపోవడంతో స్థానికంగా ఉండే గ్రామంలో చిన్న చిన్న దొంగతనాలకు చేసే వాడు. ఇదే క్రమంలో జనరల్ టికెట్లు తీసుకొని రైళ్లలో తిరుగుతూ..చోరీలకు కూడా పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 4వ తేదీన నిందితులు ముగ్గురు మోండా మార్కెట్ ప్రాంతంలో బాబా క్లాసిక్ లాడ్జిలో రూమ్‌లో ఉంటూ, పలు రైళ్లలలో నలుగురు ప్రయాణికుల వద్ద నుంచి నగలు, నగదు ఉన్న బ్యాగులను దొంగించారు. బాధితుల వద్ద నుంచి పోలీసులకు ఫిర్యాదు రావడంతో కేసులు నమోదు చేసుకొని జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న నిందితులు అన్నురాజ్, నిరాజ్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగ చోరీలకు పాల్పడుతున్నట్లుగా నేరం అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి రూ. 3.41 లక్షల విలువైన నగలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అమర్జిత్ కుమార్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలి : ఎండీఓ గీత

విజేతలకు కప్ అందజేసిన హెచ్ఎం శ్రీనివాస్ శర్మ

కందుకూరు, డిసెంబర్ 13 : విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో ఎదగాలని ఎండీఓ గీత తెలిపారు. మండల పరిధిలోని నెదునూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 2024 సీఎం కప్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా విజేతలకు కప్‌లు, మెమొంటోలను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎండీఓ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో తిమ్మాపూరు, మాదాపూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, బాలికల కబడ్డీలో కందుకూరు, నెదునూరు పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. అదే విధంగా వాలీబాల్ క్రీడల్లో పులిమామిడి, కొత్తగూడ బాలురు, తిమ్మాపూర్, మీర్‌ఖాన్‌పేట్ బాలికలు, కోకో క్రీడల్లో నెదునూరు, మీర్‌కాన్‌పేట్ పాఠశాలల బాలురు, బాలికల్లో పులిమామిడి, కందుకూరు పాఠశాలలకు చెందిన బాలికలు విజయం సాధించారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహ, నెదునూరు పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ శర్మ, మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణు ప్రియ, పీఈటీలు ఎండీ అబ్దుల్లా, స్వామి, మల్లేశ్వరీ, భాస్కర్, జావిద్, ఉపాధ్యాయులు ఎండీ బషీర్, పీఆర్‌టీయూ నాయకులు బుచ్చయ్య, టీయూ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుగ్గరాములు, ఉపాధ్యాయులు , క్రీడాకారులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 13 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామిడి చంద్రారెడ్డి కాలనీలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. దశలవారీగా పనులను పూర్తి చేయిస్తామని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. పనులు చేస్తున్న క్రమంలో అధికారులు తప్పకుండా పరిశీలించాలన్నారు. నాణ్యత లోపిస్తే సదురు కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్ద బావి శోభా ఆనంద్ రెడ్డి, పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

మల్కాజిగిరి,డిసెంబర్ 13: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మచ్చబొల్లారం డివిజన్ వీబీఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఎలక్ట్రికల్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు నాయకులు వినతి పత్రంఅందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మర్రి మాట్లాడుతూ సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు. పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి అభివృద్ధిపనులకు నిధులు కేటాయించాలని ఉత్తరం రాశామని అన్నారు. నిధులు మంజూరైన తర్వాత అభివృద్ధిపనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

బోస్కో సేవా కేంద్రంలో కల్చరల్ ఈవెంట్

రాజీవ్‌గాంధీనగర్ కల్చరల్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులతో మల్లెపాక యాదగిరి, రమావత్ దీప్‌లాల్, తదితరులు

ఎల్బీనగర్, డిసెంబర్ 13: కొత్తపేట డివిజన్, రాజీవ్‌గాంధీనగర్‌లోని పాఠశాల విద్యార్థులకు రాత్రి సమయంలో ఉచితంగా ట్యూషన్ సౌకర్యం కల్పిస్తున్న బోస్కో సేవా కేంద్రం ట్యూషన్ సెంటర్‌లో కల్చరల్ ఈవెంట్‌ను నిర్వహించింది. సెంటర్ విద్యార్థులు వివిధ రకాలైన నృత్యప్రదర్శనలు ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారుల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ మాజీ సభ్యుడు మల్లెపాక యాదగిరి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు రమావత్ దీప్‌లాల్, చాంద్ పాషా , పల్లె అజయ్‌కుమార్, బాలు, శ్యామల, సుమతి, బాస్కో సేవా కేంద్రం సభ్యులు బి. ఉష, అనిత, మమత, చెన్నమ్మ , సుగుణమ్మ , తదితరులు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్షలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఈ కోర్సుల మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ అకారులు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఈ కోర్సు వివిధ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

బీఈ పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఓయూ పరిధిలోని అన్ని బీఈ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ అధికారులు తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లిమెంటరీ పరీక్షా ఫీజును ఈనెల 19వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.